దరఖాస్తులు కుప్పలుతెప్పలు..

పరిష్కారంపై పట్టింపేది..

- రంగారెడ్డి జిల్లాలో పెండింగ్‌లో 16,499 భూ సమస్యలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు

రంగారెడ్డి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డిజిల్లాలో భూ సంబంధిత సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. భూములకు సంబంధించిన దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా వస్తున్నప్పటికీ పరిష్కారం మాత్రం ఆశించిన మేర జరగడంలేదు. జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కేసులు కూడా అంతేస్థాయిలో పెరిగిపోతున్నాయి. దీంతో సమస్యల పరిష్కారం కత్తిమీద సాములా తయారైంది. రంగారెడ్డిజిల్లాలో ప్రస్తుతం 16,499 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి తోడు ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి కూడా దరఖాస్తులు వస్తుండటంతో కేసుల సంఖ్య పెరుగుతున్నదే తప్ప తగ్గడంలేదు. జిల్లావ్యాప్తంగా కలెక్టర్ లాగిన్‌లో 7,200, ఆర్డీవో, తహసీల్దార్‌ల లాగిన్‌లో 9000ల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు జారీచేయడంతో తహసీల్దార్ కార్యాలయాల్లో సమస్యల క్లియరెన్స్ పనులు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ వివిధ కారణాల వలన ఆశించిన రీతిలో అవి పరిష్కారానికి నోచుకోవడంలేదు.

కోర్టు కేసులతో పరిష్కారం కాని సమస్యలు

జిల్లాలో భూముల ధరలు గణనీయంగా పెరగడంతో కోర్టు కేసులు కూడా అంతేస్థాయిలో ఉంటున్నాయి. క్రయవిక్రయాలు జరిగిన భూములపై కూడా తాము వారసులమంటూ సంబంధంలేనివారు కూడా కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. ఈ కేసుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు, పీవోబీ, పట్టా మార్పిడులు వంటి సమస్యలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యలన్నీ కోర్టు పరిధిలో ఉండటంతో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. తమ భూముల సమస్యలు తీరకపోవడంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కోర్టు నుంచి వచ్చే జడ్జిమెంట్ల ఆధారంగా సమస్యలను పరిష్కరించాల్సి వస్తుంది.

అధికారాలు బదలాయించినా..

సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కలెక్టర్‌తోపాటు ఆర్డీవోలకు కొన్ని అధికారాలను బదలాయించారు. పట్టా మార్పిడి, డిజిటల్ సంతకాలతోపాటు పీఓబీలో ఉన్నవాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిచేయాలని ఆర్డీవోలకు అధికారాలు బదిలీ చేశారు. కాని, ఆర్డీవో స్థాయిలో కూడా వాటి పరిష్కారంపై ఆశించిన మేర ముందుకు వెళ్లకపోవడంతో ఆ సమస్యలపై దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగక తప్పడంలేదు. దీంతో జిల్లాలో పీఎం-33, పీఓబీ వంటి సమస్యలే అధికంగా ఉన్నాయి.

ఏండ్ల తరబడి పెండింగ్‌లో..

ఎన్నో ఏండ్ల నుంచి దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలకు నేటికీ పరిష్కారం దొరకడంలేదు. రెవెన్యూ సమస్యలపై అవగాహనలేని ఎంతోమంది రైతులు పలుమార్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. **- ప్రవీణ్‌కుమార్**

భూ సమస్యలపై కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భూ బాధితులు (ఫైల్)



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను షాద్‌నగర్ భారత జాగృతి నాయకులు ఎండీ ముస్తాఫా, బాలాజీఉదయ్, చెన్నయ్య, బాబు, రాజ్‌నాయక్, రవీందర్‌గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భారత జాగృతిని మరింత బలోపేతం చేయాలని, రానున్న రోజుల్లో భారత జాగృతి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ సూచించినట్లు తెలిపారు. అదే విధంగా జాగృతి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేలా కృషి చేయాలన్నారు.
- షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 7

పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 7 : పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మొబైల్ యాప్ సర్వే విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డుల్లో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించాల్సిన విధానంపై మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. మొబైల్ యాప్‌ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన తీరును, వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఇండ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలి, మొబైల్ యాప్‌లో వివరాలను ఏవిధంగా పొందుపర్చాలి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి సర్వే కోసం ఎంపిక చేసిన గ్రామపంచాయతీల కార్యదర్శులు, ఇతర సిబ్బంది అందరికీ యాప్ ద్వారా సర్వే జరపాల్సిన విధానంపై అన్ని మండలాల్లో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ, వాస్తవ పరిస్థితులకనుగుణంగా యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరపాలన్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎలాంటి వివాదాలు, అవకతవకలకు తావులేకుండా సర్వే ప్రక్రియను నిజాయితీగా, నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ ఏఈ సిరాజుద్దీన్, డీఈలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనానికి మిషన్ భగీరథ నీరు తప్పనిసరి

సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

బషీరాబాద్, డిసెంబర్ 7 : పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనానికి తప్పనిసరిగా మిషన్ భగీరథ నీటిని వాడాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, అధికారులను ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, బీసీ బాలికల వసతి గృహం, గొట్టిగఖుర్దు పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు, రిజిస్ట్రేషన్ గదులను తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. బీసీ బాలికల వసతి గృహంలో నిలువ ఉన్న కూరగాయలు, అన్నం, చారు, బియ్యం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని అడిగారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సీసీ మాణిక్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్ ఉన్నారు.

పూడూరులో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు, డిసెంబర్ 7 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పూడూరు నుంచి మన్నెగూడ వరకు బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల్లో గెలిచారన్నారు. సంవత్సరం పూర్తవుతున్నా రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు డబ్బులతో పాటు తులం బంగారం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతు బంధు వేయకుండా మొండిచేయి చూపిందన్నారు.

ఏఐతో ఫార్మా రంగంలో మార్పులు

కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్‌లు

తుర్కయాంజాల్, డిసెంబర్ 7 : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో ఫార్మా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ప్రొఫెసర్ ఉమేశ్ బేనకర్, డాక్టర్ జాహర్‌లా అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఫార్మసీ 4.0 ఇంటిగ్రేటింగ్ ఏఐ ఐఓటీ ఫర్ మల్టీ డిసిప్లినరీ ఫ్యూచర్ పేరుతో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ఫార్మా కంపెనీలకు చెందిన ప్రముఖులు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 1000 మంది డెలిగేట్స్ 230కి పైగా ప్రజంటేషన్స్‌ను ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ విడుదల

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 7 : గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసినట్లు ఎంపీడీవో మున్నీ తెలిపారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం కోసం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను విడుదల చేశారు. కేంద్రాలవారీగా ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఫిర్యాదులు ఈ నెల 12న సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తామని వివరించారు. గ్రామాలవారీగా పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్‌ను పంచాయతీ కార్యాలయం ఎదుట నోటీస్ బోర్డులో ఉంచుతామన్నారు.

రాష్ట్ర కురుమ ఆత్మగౌరవ భవనం 14న ప్రారంభం

మణికొండ, డిసెంబర్ 7 : రంగారెడ్డి జిల్లా కోకాపేట నియోపోలీస్‌లో నిర్మించిన దొడ్డి కొమురయ్య కురుమ కుల ఆత్మగౌరవ భవనాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర కురుమ సంఘ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం కురుమ తెలిపారు. శనివారం కోకాపేటలోని కురుమ ఆత్మగౌరవ భవనం వద్ద ఆయన వివిధ శాఖల అధికారులు, రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, భవనగిరి పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ కురుమ, సంఘ ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వివిధ జిల్లాల్లోని గ్రామగ్రామాల నుంచి వేలాది మంది కురుమలు ఈ భవన ప్రారంభోత్సవంలో పాల్గొంటారని వివరించారు. ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు, భోజన వసతులు, సమావేశ ప్రాంగణ ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ భవన ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి, కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కురుమ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కురుమ, ఆల్ ఇండియా పాల్ మహాసభ అధ్యక్షుడు సైతాన్‌సింగ్ పాల్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కర్నాటక మాజీ మంత్రి హెచ్ఎం. రేవణ్ణ, చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, అనధికార ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సంధ్య, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, ఏసీపీ రమణాగౌడ్, రాష్ట్ర కురుమ సంఘ నాయకులున్నారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

టీజీ న్యాబ్ డీఎస్పీ రమేశ్‌బాబు



అవగాహన సదస్సులో టీజీ న్యాబ్ డీఎస్పీ రమేశ్‌బాబు తదితరులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 7 : చుట్టుపక్కల ఎవరైనా డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్టు గమనిస్తే వెంటనే 1908 లేదా 8712671111 నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) డీఎస్పీ రమేశ్ బాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని పల్లవి ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం యాంటీ నార్కోటిక్స్ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. మద్యం తాగడం, పొగ తాగడం, డ్రగ్స్‌కు బానిసలుగా మారిన యువతను అందులో నుంచి బయటకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో టీజీ న్యాబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మెరుగైన వైద్యం అందించాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, డిసెంబర్ 7 : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ పేదలను దృష్టిలో పెట్టుకొని సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ దవాఖానల కంటే దీటుగా తయారు చేసి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేశారని తెలిపారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని తెలిపారు. ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకొని మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులున్నారు.

జోలికి వస్తే.. తాటతీస్తాం

హిమాయత్‌నగర్, డిసెంబర్ 7 : వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనసభ సభ్యత్వాన్ని తొలగించాలని అంధుల డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేశామని తెలిపారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే శంకర్ ఒక కులాన్ని కించపరిచి మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే వెలమలను దూషించడం సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే అహంకారపూరితంగా ఒక సామాజికవర్గంపై ఈ విధమైన బెదిరింపులు, దూషణలు చేయడం ఏ మాత్రం ఉపేక్షించరానిదని హెచ్చరించారు. తమ ఆత్మగౌరవం దెబ్బతినేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారని, తాను ఒక అంధుడనైనప్పటికీ ఈ విషయంలో స్పందిస్తున్నానని తెలిపారు. సాధారణ ప్రజలు మాట్లాడితే కేసులు పెడుతున్నారని, అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పై కేసులు ఎందుకు నమోదు చేయలేదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రి పదవికి ఆశపడి నోటికి వచ్చినట్లు ఎమ్మెల్యే మాట్లాడుతున్నాడని.. వెలమల జోలికి వస్తే తాటతీస్తామని హెచ్చరించారు. సీఎం, ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చొక్కారావు

షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో అయ్యప్పస్వాములకు అదే గ్రామానికి చెందిన మైనార్టీ నాయకుడు ఎండీ బురాన్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
- షాబాద్, డిసెంబర్ 7

ఘనంగా హరికథా మహోత్సవాలు

సిటీబ్యూరో : హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాస 160వ, వారి ప్రియశిష్యుడు నేతి లక్ష్మీనారాయణభాగవతుల 126వ జయంతి హరికథా మహోత్సవాలు నల్లకుంటలోని శ్రీశృంగేరి శంకరమఠం ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య పరివారం తరపున వెంకటకృష్ణయ్య, నేతి కుటుంబం నుంచి శ్రీనివాస్, చావలి కామేశ్వర్‌రావు దంపతులు, ఉమాదేవి, శారద పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ.. హరికథ పేరు వింటే నారాయణదాసు గుర్తుకు వస్తారని, పుంభావస రస్వతిగా పేరొందిన నారాయణదాస్ నవరసభరితంగా కథాగానం చేయడంలో అందెవేసిన చేయి అని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి వయోలిన్‌పై, సుధాకర్ మృదంగంపై వాద్యసహకారం అందించగా, రామచంద్రాపురానికి చెందిన భాగవతారిణి శిఖామణి భక్తప్రహ్లాద హరికథాగానం చేసి సభికులను అలరించారు. ఆదివారం మునిలక్ష్మి భాగవతారిణిచే భక్తమార్కండేయ హరికథాగానం ఉంటుందని పర్యవేక్షకులు తెలిపారు.

రాజీవ్‌గాంధీ పార్కు ఆధునీకరణకు చర్యలు

సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా బీఎన్‌రెడ్డి నగర్‌లోని రాజీవ్‌గాంధీ పార్కు ఆధునీకరణకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. పార్కులో మౌలిక వసతుల్లేక సందర్శకులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో స్థానికుల ఫిర్యాదు మేరకు అభివృద్ధి పనులకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. రూ. ఐదున్నర లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. పార్కు పరిధిలో ప్రవేశ మార్గం, వాకింగ ట్రాక్, టాయిలెట్లు, సైన్ బోర్డులు, చెత్త కుండీలతోపాటు సందర్శకుల కోసం మరికొన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా పార్కు పరిధిలో లైటింగ్ కోసం సన్నాహాలు చేస్తున్నట్లు హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. గడిచిన ఆరేడు నెలలుగా పార్కులో లోపించిన పనులపై సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్.. అనాలోచిత చర్యలు మానుకో..

- విలేకరులతో సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాదవ్
- ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక చిహ్నాలు, తెలంగాణ తల్లి, పేర్ల మార్పును ముందలేసుకున్నారు..
- అభివృద్ధిలో ముందున్న రాష్ట్రం తల్లి ధనవంతురాలిగా ఉండొద్దా?
- కనీసం పుస్తెల తాడు కూడా లేకుండా ఉండే విగ్రహాన్ని ఇక్కడి ప్రజలు స్వాగతించరు

షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్, డిసెంబర్ 7 : 'ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నవ్.. చిహ్నాలు, తెలంగాణ తల్లి, పేర్ల మార్పును ముందలేసుకుంటున్నవ్.. సీఎం రేవంత్‌రెడ్డి.. ఇటువంటి అనాలోచిత చర్యలను మానుకో..' అని రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ హెచ్చరించారు. శనివారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీలేదని, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. అభివృద్ధిలో ముందున్న తెలంగాణ రాష్ట్రం తల్లిని ఉన్నతవంతురాలుగా చూడాల్సింది పోయి, కౌలు రైతు వద్ద వ్యవసాయ కూలీగా చూస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. తన తల్లికి బంగారు నగలు, పట్టు చీర కూడా ఉండొద్దనే భావనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలో మన మహిళలకు బంగారు నగలు ఉన్నాయా? వజ్రాలు ఉన్నాయా? వడ్డాణాలు ఉన్నాయా? అని మహిళలను తక్కువ చేసి మాట్లాడిన సీఎం తన కుటుంబ సభ్యుల పెండ్లి వేడుకల్లో ఆభరణాలు ధరించలేదా ? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి ఎంతో మంది కళాకారులు, మేధావులు, కవులు అభిప్రాయాల మేరకు తెలంగాణ తల్లి విగ్రహాన్ని గొప్పగా తీర్చిదిద్దితే.. నేటి పాలకులు పేద తల్లిగా రూపొందించి గదుల మధ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం తెలంగాణ తల్లి నూతన విగ్రహాల ఆవిష్కరణల కార్యక్రమాలను నిరసిస్తూ.. గతంలో రూపొందించిన తెలంగాణ తల్లికి క్షీరాభిషేకాలు చేస్తామని, తెలంగాణవాదులు, ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు అశోక్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాజశేఖర్, శ్రీను పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. యువకుడి బలి

మృతుడు పోశిరెడ్డి(ఫైల్)

వికారాబాద్, డిసెంబర్ 7 : ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకుని.. డబ్బులు పోగొట్టుకున్న ఓ యువకుడు మనస్తాపంతో బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ ఠాణా పరిధిలో శనివారం జరిగింది. వికారాబాద్ ఎస్ఐ విమల, బాధితుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా, వికారాబాద్ మండలంలోని పీరంపల్లి గ్రామానికి చెందిన బండి నోళ్ల మంజుల, రంగారెడ్డి దంపతులకు పోశిరెడ్డి(30) అనే కొడుకున్నాడు. వారికి ఉన్న రెండున్నర ఎకరాల పొలంలో పూలు, ఇతర పంటలను సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత మూడేండ్ల కిందట రోడ్డు ప్రమాదంతో తండ్రి మృతి చెందగా.. తల్లి, కుమారుడు కలిసి వ్యవసాయం చేస్తున్నారు. అయితే మూడు రోజుల కిందట పోశిరెడ్డి మొబైల్‌కు ఆన్‌లైన్ యాప్ వారు ఫోన్ చేశారు. పాతనాణేలను సేకరిస్తే మీ బ్యాంకు ఖాతాలో డబ్బులు చేస్తామని.. అందుకు ముందుగా రూ.35,000 చెల్లించాలని చెప్పగా ఆన్‌లైన్ ద్వారా చెల్లించారు. శుక్రవారం వారు మరోసారి ఫోన్ చేసి మరిన్ని డబ్బులు జమ చేయాలని చెప్పడంతో మోసపోయానని.. మనోవేదనకు గురైన అతడు అదే రోజు మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుమారుడు, భర్త మృతి చెందడడంతో తల్లి అనాథగా మారింది. మృతుడి పెదనాన్న మాణిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.